క్లుప్తంగా

కియో జాతీయ పోటీలకు సాయివర్షిణి



మహబూబ్‌నగర్ క్రీడలు: ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో ఈనెల 12 నుంచి 15 వరకు జరిగే 4వ కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కియో) జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో బి.సాయివర్షిణి పాల్గొంటున్నట్లు కరాటే మాస్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. గతంలో ఎల్‌బీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి కియో కరాటే పోటీల్లో సాయి వర్షిని-30కేజీల విభాగంలో మెరుగైన ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సాయి వర్షిణిని జీకే మాస్టర్ షోటోకాన్ చీఫ్ జి.కృష్ణయ్య అభినందించారు. జాతీయస్థాయిలో పతకం సాధించి జిల్లాకు పేరు ప్రతిష్ఠ తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

స్వేరో జిల్లా అధ్యక్షుడిగా శ్రీను



జడ్చర్ల టౌన్: స్వేరో జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని గొల్లపల్లికి చెందిన లీడర్ శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్వేరో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోడ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన ఎన్నికను ప్రకటించారు. 8ఏళ్లుగా జిల్లాస్థాయిలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం, స్వేరో బలోపేతానికి కృషిచేయడం, పేద విద్యార్థులతో గురుకుల ప్రవేశ పరీక్షలు రాయించి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించినందుకు జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు వెంకటేశ్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా పవన్‌కుమార్, కోశాధికారిగా కేశవులు, కార్యవర్గ సభ్యుడిగా నర్సింహులును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఆనంద్‌కుమార్‌కు అవార్డు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీలక్ష్మీనారాయణ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌కు అవార్డు దక్కింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన వేదికలో రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్, ప్రగతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలకు గాను అవార్డు ప్రదానం చేయడం సంతోషంగా ఉందని.. ఈ అవార్డు తనకు మరింత బాధ్యత పెంచిందని ఆనంద్‌కుమార్ తెలిపారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అసెంబ్లీలో ఏకైక ముదిరాజ్ ఎమ్మెల్యేగా ఉన్న వాకిటి శ్రీహరికి మంత్రి పదవి అవకాశం కల్పిస్తామని పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి డోకూర్ భీంరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి సీఎం వెన్నుదన్నుగా ఉన్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ముదిరాజ్‌లు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. బీసీల్లో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు కాంగ్రెస్ పార్టీ మాత్రమే న్యాయం చేస్తుందని.. అందుకు వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వడమే నిదర్శనమని తెలిపారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం



మహబూబ్‌నగర్ రూరల్: ఎమ్మార్పీఎస్ టీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్‌కు తమిళనాడులోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఏనుగొండ రెవెన్యూ వార్డులో ఆదివారం మాదిగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన సామాజిక సేవ సేవలను కొనియాడారు. శ్రీనివాస్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

టెర్రర్ ట్రాన్స్‌ఫార్మర్స్!



ఎర్రసత్యం పాఠశాల ఎదురుగా రోడ్డు మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- ఇళ్ల మధ్య కంచెల్లేని విద్యుత్ నియంత్రికలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు



సరస్వతీ నగర్‌లో బాలుడి ప్రాణం తీసిన ట్రాన్స్‌ఫార్మర్ ఇదే..

జడ్చర్ల/జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కంచె ఏర్పాటు చేయక పోవడంతో మనుషుల ప్రాణాలతో పాటు పశువులు, ఇతర జీవుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడం.. విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండటం.. ముళ్లపొదలు పేరుకుపోవడం..వాటి చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయక పోవడం వంటి కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని కాలనీల్లో స్థలాభావం వల్ల ఒకే చోట రెండు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేసి నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు.

ముళ్లపొదల్లోనే..

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎక్కువగా ముళ్లపొదలు ఉంటున్నాయి. తీగజాతి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లను అల్లుకుపోతున్నాయి. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా మారుతుంది. విద్యుత్‌శాఖ సిబ్బంది మాత్రం వాటి వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ కోవలోనే ఇటీవల స్థానిక సర్వసతీ నగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ బాలుడు ప్రాణం కోల్పోవాల్సి వచ్చింది.

నిండా నిర్లక్ష్యం..

పట్టణంలోని సరస్వతీ నగర్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద భరితంగా మారాయని.. వాటి చుట్టూ ముళ్లపొదలు తొలగించి కంచె ఏర్పాటు చేయాలని కోరినా విద్యుత్‌శాఖ పెడిచెవిన పెట్టిందని కాలనీ వాసులు వాపోతున్నారు. చివరకు తామే చందాలు వేసుకుని కంచె ఏర్పాటు చేస్తామన్నా వినిపించుకోలేదని పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం కాలనీకి చెందిన ఓ పాడి పశువుతో పాటు పలు మూగజీవాలు ఇక్కడ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాయని తెలిపారు. అప్పుడే విద్యుత్ సిబ్బంది స్పందించి ఉంటే.. ఓ పసివాడి ప్రాణం బలయ్యే పరిస్థితి ఉండేది కాదని అంటున్నారు. కాగా, మున్సిపాలిటీలో ప్రమాదరకర ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించాలని విద్యుత్ లైన్‌మేన్‌లను విద్యుత్‌శాఖ అధికారులు ఆదేశించారు. జీపీఎస్ ట్రాక్‌తో ఫొటోలను సేకరించి నివేదించాలని సూచించారు. ఇప్పటికే మున్సిపాలిటీలో 15 ట్రాన్స్‌ఫార్మర్లకు పైగా గుర్తించినట్లు సమాచారం.

జడ్చర్ల బల్దియాలో ఇదీ పరిస్థితి..

- పాతబజార్ ఎర్రసత్యం పాఠశాల ఎదురుగా రోడ్డు మలుపు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె తక్కువ ఎత్తులో ఉండటం ఇబ్బందికరంగా మారింది.
- పాతబజార్‌లోనే ఆనంద్ అనే వ్యక్తి ఇంటి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తులోనే ఉన్నప్పటికీ.. ఫ్యూజ్ బాక్స్ కిందకు వేలాడుతుండటం.. విద్యుత్ వైర్లు సైతం కిందకు వేలాడటంతో ఎప్పుడే ప్రమాదం సంభవిస్తుందో తెలియని దుస్థితి నెలకొంది.
- 18వ వార్డులోని హనుమాన్ దేవాలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో అనేక ప్రమాదాలు జరిగాయి. పలుమార్లు మేకలు, గేదెలు మృత్యువాతపడ్డాయి.
- 19వ వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఇనుప స్తంభం ఉండటంతో ఎవరూ అటువైపు వెళ్లకుండా ఉండేందుకు గాను సెంట్రింగ్ కర్రలను అడ్డుగా ఉంచారు.
- హౌసింగ్‌బోర్డు కాలనీ వాద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎప్పుడూ మంటలు వస్తూనే ఉంటాయని స్థానికులు తెలియజేశారు. వర్షం పడితే చాలు ఒక రకమైన శబ్దం వస్తూ నిప్పురవ్వలు ఎగిసి పడతాయని చెబుతున్నారు. ఇలా మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి.



నిమ్మబావిగడ్డలో ఇలా..

పట్టించుకోవడం లేదు..



నిమ్మబావిగడ్డలో ప్రధాన రహదారి పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయని.. వాటిని మార్చాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. 18వ వార్డు హనుమాన్ దేవాలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేకలు, గేదెలు చనిపోయాయి. అయినా రక్షణ చర్యలు చేపట్టడం లేదు. 19వ వార్డులోనూ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. అధికారులు వాటిని మార్చాలి.

– అజహర్, నిమ్మబావిగడ్డ

మరో చోటికి మార్చాలి..



ఎర్రసత్యం పాఠశాలకు ఎదురుగా రోడ్డు మలుపులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలి.

– రాచూరి వెంకటేశ్, పాతబజార్

ప్రమాదకరంగా ఉన్న వాటిని గుర్తిస్తున్నాం..

మున్సిపాలిటీలో ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించాలని మా సిబ్బందిని ఆదేశించాం. సరస్వతీ నగర్‌లో జరిగిన ఘటన బాధాకరం. అలాంటివి మరోసారి జరగకుండా చర్యలు తీసుకుంటాం. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కంచెలు ఏర్పాటు చేస్తాం. అవసరమైన చోట స్థలం మార్పు చేస్తాం.

– ఎర్రన్న, పట్టణ ఏఈ, విద్యుత్‌శాఖ

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ వెంకటయ్య

మిడ్జిల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి మెరుగైన విద్య అందిస్తున్నట్లు ఎంఈఓ వెంకటయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికెళ్లి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాం దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధనతో విద్యార్థులు ప్రైవేటుకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపించి డబ్బులు వృథా చేసుకోవద్దని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘మృగశిర కార్తె’ సందడి



కోయిల్‌కొండలో చేపల విక్రయాలు

జడ్చర్ల టౌన్/కోయిల్‌కొండ: మృగశిర కార్తె వేడుకలను ఆదివారం పల్లె, పట్టణం తేడా లేకుండా ఘనంగా జరుపుకొన్నారు. మృగశిర కార్తె నాడు చేపలు, మాంసం తింటే ఆరోగ్యానికి మంచిదని భావిస్తారు. ఎక్కువగా చేపలు తినేందుకు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో మాంసం, చేపల విక్రయ కేంద్రాలు తెల్లవారుజాము నుంచే రద్దీగా మారాయి. నాటుకోళ్లకు డిమాండ్ పెరిగింది. జడ్చర్ల పట్టణంతో పాటు కోయిల్‌కొండ మండల కేంద్రంలో చేపల విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి. కోయిల్‌సాగర్ రిజర్వాయర్, వివిధ గ్రామాల చెరువుల్లో పట్టిన చేపలను భారీగా కోయిల్‌కొండగా తీసుకొచ్చి విక్రయించారు. సాధారణ రోజుల్లో రూ.70 నుంచి రూ. 80 ధర ఉండే బొచ్చ, జల్లలను రూ.120 నుంచి రూ.130 వరకు, కొర్రమీను రూ. 300 నుంచి రూ. 400 వరకు కిలో చొప్పున విక్రయాలు చేపట్టారు. ఈ రోజున మాంసం తినని వారు ఇంగువ, బెల్లం కలిపి భుజించారు. తద్వారా వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా శరీరంలో జీర్ణక్రియ మారుతుందని పెద్దలు చెబుతున్నారు. కాగా, మృగశిర కార్తె ఆరంభంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వానాకాలం సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

పైప్‌లైన్‌కు మరమ్మతు చేయండి



మాగనూర్: మండల పరిధిలో వడ్వాట్ గ్రామంలోని వడ్వాట్–అడవిసత్యారం ప్రధాన బీటీ రహదారి మధ్యలో తాగునీటి పైపులైన్ పగిలిపోయి తాగునీరు వృథాగా పోతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. భారీ ట్రిప్పర్లు ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తుండడంతో పైపులైన్ పగిలిపోయింది. దీంతో నీరంతా లీకేజీ అవుతుంది. వర్షాకాలం కావడంతో ఇప్పటికే ఇళ్ల మధ్య బురదగా మారుతుండగా ఇప్పుడు తాగునీటి పైపులైన్ కూడా పగిలిపోవడంతో మరింత ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి పైపులైన్‌కు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

రెనివట్లలో తాగునీటి ఎద్దడి

మద్దూరు: మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్ల గ్రామంలోని కృష్ణదేవాలయం నుంచి రగ్‌కటే సాబ్ దర్గ వరకు ఉన్న కాలనీలో నీటి కష్టాలు మొదలయ్యాయి. రెండు నెలల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. గ్రామంలో బీటీ రోడ్డు పనుల వల్ల తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో ఈ సమస్య వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. రోజు విడిచి రోజు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా అవి ఏ మాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా రెండు రోజుల్లో పైప్‌లైన్ పనులు పూర్తి చేసి తాగునీటిని అందిస్తామని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులతో హైదరాబాద్, మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ల సభ్యులు

నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని డీఎచ్ఎంఓ మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో హైద్రాబాద్, మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత క్రికెట్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల దశలోనే క్రీడల పట్ల మక్కువ చూపాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. ఉచితంగా కోచింగ్ ఇవ్వడం సంతోషించదగ్గ విషయమంటూ.. అసోసియేషన్‌లను ప్రత్యేకంగా అభినందించారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థులు భవిష్యత్‌లో అనంతరం విద్యార్థులకు సెర్టిఫికెట్లు జారీ చేశారు. కార్యక్రమంలో సమ్మర్ క్రికెట్ క్యాంప్ ఇన్‌ఛార్జ్ రమణ, డాక్టర్ వినోద్, కోచ్ అజయ్. చెన్నారెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సల్కర్‌పేటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన కాంగ్రెస్ నాయకులు

గండేడ్: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సల్కర్‌పేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలకు గూడు సౌకర్యం కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఊశన్న, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి పోరాటంతోనే సమస్యల పరిష్కారం



పండుగ సాయన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: సమష్టి పోరాటంతోనే ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కారమవుతాయని ముదిరాజ్ మహాసభ సంఘం మండల అధ్యక్షుడు చంద్రుడు అన్నారు. మృగశిర కార్తెను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్‌లో ముదిరాజ్ జెండాను ఆవిష్కరించి.. బహుజనుల ఆశాజ్యోతి పండుగ సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు అధిక స్థానాల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లు ఐక్యంగా ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధ్యమవుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ గ్రూప్‌లోకి మార్చాలన్నారు. ముదిరాజ్ యువత క్రియాశీలక రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రచార కార్యదర్శి వెంకట్రాములు, నాయకులు మాధవులు, ఆంజనేయులు, కృష్ణయ్య, తిరుపతయ్య, నరేందర్, కుమారస్వామి, శేఖర్, నర్సింహులు, జంగయ్య, శేఖర్, లోకేష్, వరకుమార్, దయాకర్, శివశంకర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988–89 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 36ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. అంతకు ముందు పాఠశాల ముఖద్వారం నుంచి తమ గురువులు ఖాజామైనొద్దీన్, వెంకటయ్య, జహంగీర్‌లకు ఘనస్వాగతం పలికారు. వారిపై పూలు చల్లుకుంటూ స్వాగతించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. అనంతరం గురువులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు శ్రీనివాస్, గణేశ్‌గౌడ్, సుష్మ, అంజమ్మ, సహజాద్, రవీందర్, మాసయ్య, వెంకటయ్య, స్వరూపరాణి, రాజేశ్వరి, రాఘవేందర్, నర్సింహులు, నాలమ్మ, పద్మ, వెంకటేశ్, నర్సింహాచారి, చిన్నారెడ్డి, హమీద్, జాకీర్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా జీపీ భవన నిర్మాణం



అసంపూర్తిగా నిలిచిన జీపీ భవన నిర్మాణం

చిన్నచింతకుంట: మండలంలోని ఏదులాపురం గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. ఏదులాపురం గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటుచేసిన గత ప్రభుత్వం.. 2023లో జీపీ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 20లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులు చేపట్టిన గుత్తేదారు భవనాన్ని అసంపూర్తిగా నిర్మించి వదిలేశాడు. భవన నిర్మాణం పూర్తిపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. దీంతో గ్రామ పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పంచాయతీ కార్యాలయ భవనం కలగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయించాలని కోరుతున్నారు.

రోడ్డు మలుపుల వద్ద సూచిక బోర్డులు కరువు



మద్దిగట్ల స్టేజీ వద్ద మలుపు ఇలా..

భూత్పూర్: మున్సిపాలిటీ నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్లే ప్రధాన రహదారి మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం నాగర్‌కర్నూల్, అచ్చంపేట, శ్రీశైలం, వనపర్తి ప్రాంతాలకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భూత్పూర్, గోప్లాపూర్, కొత్తమొల్గర, మద్దిగట్ల స్టేజీ వద్ద మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేకపోతున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి ప్రాణాలను కోల్పోతున్నారు. గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు సూపర్‌వైజర్‌ను నియమించడంతో రహదారిపై నిఘా ఉండేది. కొన్నేళ్ల క్రితం వారిని తొలగించడంతో రహదారిపై పర్యవేక్షణ లేకుండా పోయింది. ఈ క్రమంలో రోడ్డు మలుపులు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

శిథిల భవనం.. చదువుపై ప్రభావం



శిథిలావస్థకు చేరిన దాసర్‌పల్లి పాఠశాల భవనం



తరగతి గది కిటికీ వద్ద ఊడిపోయిన ఇటుకలు

- దుస్థితిలో దాసర్‌పల్లి పాఠశాల

అడ్డాకుల: మూసాపేట మండలం దాసర్‌పల్లి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పాఠశాలలో రెండు తరగతి గదులు మాత్రమే ఉండగా.. వాటిలో ఒకటి పూర్తి శిథిలావస్థకు చేరింది. పైకప్పు నుంచి వర్షపునీరు గదిలోకి వస్తుండటంతో గోడలు నెర్రలు బారాయి. గది కిటికీ వద్ద గోడ పూర్తిగా పాడైంది. గోడ లోపల ఉన్న ఇటుకలు కూలి పడుతున్నాయి. దీనివల్ల ఆ తరగతి గదిలో విద్యార్థులను కూర్చోబెట్టే పరిస్థితి లేదు. గతేడాది ఆ గది పక్కనే ఉన్న మరో గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. వర్షం కురిస్తే ఒక తరగతి గదిలోనే విద్యార్థులందరినీ కూర్చోబెట్టి చదువులు చెప్పారు. వర్షం రాని సమయంలో కొందరు విద్యార్థులకు పాఠశాల వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. పైకప్పుపై వర్షపునీరు ఎక్కువ రోజులు నిలవడం వల్లే గదుల్లోకి నీరు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. దీంతో పాటు నిర్వాహణ లేక కిటికీ వద్ద గోడ పూర్తిగా శిథిలమవుతోంది. గోడకు ఏదైనా బలంగా తగిలితే కూలిపోయే విధంగా మారింది. గతేడాది అమ్మ ఆదర్శ పాఠశాల కింద పాఠశాలలో కొన్ని మరమ్మతు పనులు చేయించారు. అయితే శిథిలమైన గదిని బాగు చేయించడానికి తగినన్ని నిధులు లేకపోవడంతో అలాగే వదిలేశారు. ఈసారి ముసురు వర్షాలు కురిస్తే శిథిలమైన గదితో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల విద్యార్థులకు ప్రమాదం సంభవించక ముందే జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.